

హోమ్ ఓటింగ్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

హోమ్ ఓటింగ్‌పై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గం, అసిస్టెంట్ రిటర్నింగు అధికారులు ఎస్‌వి.రమణ, ఆర్‌ఎంసి డిప్యూటీ కమిషనరు, కె.ఆంజనేయులు, అన్నారు. సోమవారం ఆనం కళాకేంద్రంలో సెక్టర్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులతో హోమ్ ఓటింగు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోవిడ్ సమయంలో ప్రజల సౌకర్యార్థం హోమ్ ఓటింగ్‌ను ప్రారంభించారన్నారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు, 40శాతం వికలాంగత్వం కలిగిన వారు, కోవిడ్ బాధితులకు ఈ సౌకర్యం కల్పిస్తారన్నారు. హోమ్ ఓటింగు సౌకర్యం కావాల్సిన వారు 12డి ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హోమ్ ఓటింగ్ జరిగేటప్పుడు ఫొటోలు తీసుకోవాలన్నారు

మున్సిపల్ స్కూల్స్‌పై రేషనలైజేషన్ కత్తి

- హేతుబద్ధీకరణతో ఇప్పటికే జడ్‌పి పాఠశాలలు కుదేలు
- ఆందోళనలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మున్సిపల్ పాఠశాలలపై రేషనలైజేషన్ కత్తి వేలాడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తు జాతీయ నూతన విద్యా విధానం ఫలితంగా జిఒ 117 అమలు చేస్తున్న విషయం విధితమే. తాజాగా మున్సిపల్ పాఠశాలల్లోనూ మ్యాపింగ్ ప్రక్రియకు కసరత్తు మొదలైంది. మున్సిపల్ పాఠశాలల్లో రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు పంపడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సూచనలకనుగుణంగా ఉమ్మడి జిల్లాలో వివరాలను సేకరించే కసరత్తును విద్యాశాఖ ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్‌లతో పాటు, నిడదవోలు, తుని, పిఠాపురం, అమలాపురం, రామచంద్రాపురం, మండపేట, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటికే జడ్‌పి, గవర్నమెంట్ యాజమాన్య పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో 1, 2, 3 తరగతులను ఒక కిలోమీటరు దూరంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియను అమలు చేస్తుండగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటన ప్రభుత్వానికి ఎదురైన విషయం తెలిసిందే. ఈ మేరకు రేషనలైజేషన్ ప్రక్రియను అమలు చేయడం వల్ల పెద్దసంఖ్యలోనే ప్రభుత్వ పాఠశాలలు మూతపడటమో లేదా విలీన పాఠశాలలు దూరాభారం కావడం వల్ల బాలబాలికల సంఖ్య గణనీయంగా పడిపోయింది. రేషనలైజేషన్ వల్ల పాఠశాలల కుదింపు జరగడంతో పాటు టీచర్లు రోజువారీ బోధించే పిరియడ్ల సంఖ్య దాదాపు 50 శాతం పెరిగిపోవడంతో ఉపాధ్యాయులపై పని భారం పెరిగింది. ప్రభుత్వం ఇపుడు రేషనలైజేషన్‌ను మున్సిపల్ పాఠశాలలకు కూడా విస్తరించాలని నిర్ణయించడం ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లోనే హేతుబద్ధీకరణ అనంతరం సుమారు 100 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, అదే సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ టీచర్లు ఉంటారని అంచనా. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని మిగతా మున్సిపాలిటీలలోనూ తలెత్తవచ్చునని తెలుస్తోంది. ఇంతకుముందు మున్సిపల్ పాఠశాలల నిర్వహణ అధికారాలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో ఉండేవి. ఇటీవల ఈ అధికారాలను పంచాయతీరాజ్ ,ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ చూసే పాఠశాల విద్యాశాఖకు బదలాయించారు. తాజాగా రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టిన కార్పోరేషన్,మున్సిపల్ పాఠశాలల్లో సర్‌ప్లస్ టీచర్లను జిల్లా యూనిట్‌గా ఇతర మున్సిపాల్టీల్లో కొరత వున్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. కాగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్లను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాలంటే జిల్లాలో మరో మున్సిపల్ కార్పోరేషన్ లేకపోవడంతో సాంకేతికపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.నూతన విద్యా సంవత్సరం నుంచి ఈ ప్రక్రియ అమల్లోకి రానున్నట్లు తెలిసింది.



తక్షణమే జిఒ117 రద్దు చేయాలి

జిఒ నెం.117ను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలి. పాఠశాలల విలీనం కారణంగా అనేక డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. బాల బాలికలకు విద్య దూరమవటతో పాటు ఉపాధ్యాయులపైనా పని భారం పెరుగుతోంది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసన మండలిలో ప్రశ్నించడంతో పాటు బడికోసం బస్సు యాత్ర చేపట్టి నిరసన తెలియజేశారు. మున్సిపల్‌స్కూల్ విలీన ప్రక్రియ తక్షణమే విరమించుకోవాలి.

- ఎ. షరీఫ్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పెన్షన్ల పంపిణీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పింఛన్లను పంపిణీ చేస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ, వేసవి దష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు, ఉపాధి హామీ, తాగునీరు సరఫరా ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సచివాలయాల ద్వారా పింఛన్లను పంపిణీ చేయడానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ డి.బాలశంకర రావు, డ్వామా పీడీ ఎ.ముఖలింగం, ఆర్‌ఎంసి ఎస్ఇ జి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

ఆర్ట్స్ కళాశాలలో సింగిల్ మేజర్ వ్యవస్థ పై శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ఆర్ట్స్ కళాశాల నోడల్ రిసోర్స్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంపై సోమవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏప్రిల్ 1 నుంచి 6వ తేదీ వరకు ఈ శిక్షణ జరుగనుంది. 2023 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశ పెట్టారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ వారు సింగిల్ మేజర్ విధానం గురించి అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా రాజనీతి శాస్త్ర విభాగానికి సంబంధించి ఆరు నోడల్ రిసోర్స్ సెంటర్ల నుంచి 63 మంది రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, రెండు రిసోర్స్ సెంటర్ల నుంచి 17 మంది చరిత్ర అధ్యాపకులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభ సమావేశానికి కళాశాల విద్యాశాఖ కమిషనం ఆన్‌లైన్‌లో పాల్గొని మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఎస్.శాస్త్రి అధ్యక్షత వహించారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి టి.తులసి, అకాడమిక్ సెల్ సమన్వయకర్త డా బి.సంజీవ్‌కుమార్,



రాజమండ్రి కళాశాల ఎన్ఆర్‌సి సమన్వయకర్త సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూడు దశల్లో కొనుగోలు కేంద్రాలు : జెసి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రబీ ధాన్యం కొనుగోలు కోసం మూడు దశల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని జెసి తేజ్ భరత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల, అనుబంధ శాఖల అధికారులతో రబీ సీజన్ ధాన్యం సేకరణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి తేజ్‌భరత్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుత రబీలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలోని 229 ఆర్‌బికెల పరిధిలో మంగళ వారం నుంచి సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు కార్యచరణ సిద్ధం చేశామని తెలిపారు. అందులో భాగంగా మూడు దశల్లో ఆయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. తొలి దశలో చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, రంగంపేట మండలాల్లో ఉన్న 87 కోనుగోలు కేంద్రాలను మంగళ వారం నుంచి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండో విడతలో బిక్కవోలు, కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, ఉండ్రాజవరంలో ఏప్రిల్ 5 నుంచి 55 కోనుగోలు కేంద్రాల ద్వారా, మూడో విడతలో అనపర్తి, గోకవరం, కోరుకొండ, సీతానగరం, నల్లజర్ల, గోపాలపురం, పెరవలి పరిధిలోని 87 కేంద్రాల ద్వారా ఏప్రిల్ 9 నుంచి కొనుగోళ్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల డిఎం టి.రాధిక, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.విజయభాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

5 వరకూ గురుకులం దరఖాస్తులు

ప్రజాశక్తి -గోకవరం

భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఈ నెల 5వ తేదీవరకూ ఇస్తారని ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. 5వ తరగతికి 80 సీట్లుకు, 6, 7, 8 వ తరగతికి మిగిలిన సీట్ల భర్తీకి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీటితోపాటు రాష్ట్రంలో 7 జూనియర్ కళాశాలలకు, అలాగే నాగార్జునసాగర్ డిగ్రీ కళాశాలలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఏప్రిల్ 25న రాజమహేంద్రవరంలో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 876265028 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కూటమి ఆధ్వర్యంలో సమావేశం

ప్రజాశక్తి - పెరవలి

మండలం తీపర్రులో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తల సమావేశం జిరగింది. కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కందుల దుర్గేష్ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శేషరావు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల మండల అధ్యక్షులు అధికాల శ్రీను, పిప్పర రవి, కంటిపూడి సూర్యనారాయణ ప్రత్తిపాటి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-నల్లజర్ల

జవహర్ నవోదయ ఆరోతరగతిలో ప్రవేశానికి మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌కెఎస్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సీమకుర్తి వెంకట సత్యనారాయణ తెలిపారు. నల్లజర్ల సెయింట్ క్లారిటీ పాఠశాల నుంచి నీలం ఝాన్సీలక్ష్మీశరణ్య, తెలికిచెర్ల ఎస్‌కెఎస్ పాఠశాల నుంచి వైష్ణవి నవోదయకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి పద్మావతి తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌పై కార్యాచరణ సిద్ధం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌పై కార్యాచరణను సిద్ధం చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. సోమవారం వెలగపూడి నుంచి పోస్టల్ బ్యాలెట్ అండ్ హోమ్ ఓటింగ్‌కు సంబంధించి అధికారులు నిర్వహించాల్సిన విధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా దిశా నిర్దేశనం చేశారు. వైఎస్ఆర్ జిల్లా ఎన్నికల అధికారి వి.విజయరామ రాజు ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పలు అంశాలను చర్చించారు. పోస్టల్ బ్యాలెట్ అండ్ హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో తేదీలా వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాల గురించి సమగ్ర సమాచారం అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జిల్లాలో వివరాలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా రిజర్వ్ ఎన్నికల సిబ్బందితో కలిసి 11,334 మంది ఆబ్సెంటీ ఓటర్లు, 85 ప్లస్ ఓటర్లు 11,514, పిడబ్ల్యుడి ఓటర్లు 19,690 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ నియోజక వర్గాలు పరిధిలో హోమ్ ఓటింగ్‌కి సంబంధించి సహేతుకమైన వివరాలు సేకరించి ఫారం 12డి ద్వారా ధవీకరణ పత్రాలను సేకరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్‌ఒ, జెసి ఎన్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్‌ఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, రాజానగరం ఆర్‌ఒ, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, గోపాలపురం ఆర్‌ఒ కెఎల్.శివజ్యోతి, నిడదవోలు ఆర్‌ఒ, ఆర్‌వి.రమణానాయక్, ఎం.మాధురి, కెఆర్‌సిఎస్‌డిసి ఆర్.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్, పి.సువర్ణ పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

9నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - గోపాలపురం

ఈనెల 9వ తేది నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ డి.వనజాక్షి కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభానికి సబంధించి వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో మండల వ్యవసాయ శాఖ అధికారి రాజారావు ఆధ్వర్యంలో మొదటి మైత్రి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోళ్ల వచ్చిన మార్పులు, విధివిధానాల గురించి మండల స్థాయిలో ప్రతి 15 రోజులకు ఒకసారి మైత్రి కమిటీ సమావేశమును నిర్వహిస్తామన్నారు. ధాన్యం రవాణాకు ఉపయోగించే వాహనాలకు తప్పని సరిగా జిపిఎస్ ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో వివిధ శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. 15 రోజులకు ఒకసారి ఆయా విభాగాలకు, సంబంధించి అధికారులు, మిల్లర్లలతో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. మండలంలో ఈ సీజన్‌లో ఇప్పటికే 1,00,078 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. దీని కోసం 2,519,54 గోనెసంచులు అవసరమన్నారు. కొనుగోళ్ల ప్రారంభానికి ముందుగానే ఆయా ఆర్‌బికెల వద్ద గో నె సంచులను సిద్ధం చేశామన్నారు. రైస్ మిల్లర్ నుంచి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసునకురావాలన్నారు. రైతులకు, సిబ్బందికి ఇబ్బంది కలగకుండా ఉండేలా రైతు భరోసా కేంద్రం సిబ్బంది సమన్వయంగా కలిసి పని చేయాలని వ్యవసాయ అధికారి ఎ.రాజారావు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోనీ కస్టోడియన్ అధికార్లు, కంట్రోల్ రూమ్ సిబ్బంధి,గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఓటుపై అవగాహన కోసం బైకు ర్యాలీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఓటు హక్కుపై ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు బైకు ర్యాలీని నిర్వహించామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఓటు హక్కును నిర్భయంగా స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటు హక్కు ఉన్న ఓటర్లందరూ తప్పకుండా పోలింగు రోజున పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి జగదీష్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, బిఎల్‌ఒలు, పౌర సరఫరాల సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

పలు గ్రామాల్లో పోలీసు కవాతు


ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెం, దారవరం, మార్కొండపాడు, చంద్రవరం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. కొవ్వూరు రూరల్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామాల్లో కవాతు నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పించారు. సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. చాగల్లు ఎస్ఐ పి.నాగరాజు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దానికి పోలీసు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.

మోహన్ సిధ్వికి నవోదయలో సీటు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని గవర్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి జి.మోహన్‌సిధ్వి నవోదయలో సీటు సాధించాడు. మండల విద్యాశాఖాధికారులు బి.బాలసుబ్రహ్మణ్యస్వరూప్, షేక్ నూర్జహాన్ విద్యార్థిని అభినందించారు. నూర్జహాన్ మాట్లాడుతూ సిధ్వీ సీటు సాధించడం మండలానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన హెచ్ఎం వెలగన సూర్యభాస్కరరెడ్డి, ఉపాధ్యాయుడు కె.ప్రసాద్‌బాబులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెలిగట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి.రవికుమార్, కె.మహేష్, గణపతి, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.



ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు నియోజక వర్గ పరిధిలో హోమ్ ఓటింగు, అబ్సెంటీ ఓటర్ల జాబితా మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగు శాతం పెరిగేలా ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేసుకుని అమలు చేయాలని కొవ్వూరు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుందర సాయి కళ్యాణ మండపంలో కొవ్వూరు సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో హోమ్ ఓటింగ్, అబ్సెంటీ ఓటర్ల గుర్తింపు, తదుపరి కార్యాచరణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు నియోజక వర్గం పరిధిలో ఓటింగు శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల్లో భాగంగా 85 ఏళ్లు నిండిన ఓటర్లు, 40 శాతం పైబడిన వికలాంగ ఓటర్ల ఐచ్చికం మేరకు 12డి ఫారం ద్వారా అంగీకారం తెలిపిన వారికి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కొవ్వూరు నియోజక వర్గ పరిధిలోని ఉన్న 176 పోలింగ్ కేంద్రాల్లో 85 ఏళ్లు నిండిన ఓటర్లు 583 మంది, 40 శాతం పైబడిన వికలాంగత్వం కలిగిన వికలాంగ ఓటర్లు 2,393 ఉన్నట్లు గుర్తించామన్నారు. వారు పోలింగు కేంద్రానికి వచ్చి లేదా ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వారి నుంచి 12 డి ఫారం ద్వారా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు బిఎల్‌ఒలు అంగీకార పత్రం తీసుకుని ఆమేరకు ఓటు హక్కును కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో బిఎల్‌ఒలు, ఇతర అధికారులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యే పిఒలు, అనుబంధ సిబ్బంది, రిజర్వ్‌తో కూడిన 1,309 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు వారి నుంచీ ఫారం 12 ద్వారా డిక్లరేషన్ పొందాల్సి ఉంటుందన్నారు. మొదటి శిక్షణ కార్యక్రమం సందర్బంలో ఆ మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు కె.మస్తాన్, ఎం.సావిత్రి, సిహెచ్.శ్రీనివాస్, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్‌జోసెఫ్ , సెక్టార్ అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్

రాష్ట్రాన్ని కాపాడేందుకే పొత్తు

ప్రజాశక్తి-నల్లజర్ల

రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే పొత్తుతో పోరాడుతున్నామని టిడిపి ప్రధాన కార్యదర్శి, గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు అన్నారు ఆదివారం రాత్రి నల్లజర్ల మండలం ఆవపాడులో జనసేన జిల్లా కన్వీనర్ ఆవపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ సత్యనారాయణ గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను అంతమొందించాలంటే ఉమ్మడి కార్యాచరణలో ప్రజలు ఓటు ద్వారా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, మండల అధ్యక్షులు సోడాసాని బాపిరాజు, తలారి సౌజన్య, శెట్టిపల్లి శివనాగరాజు. యద్దనపూడి బ్రహ్మ రాజు. పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ప్రక్కిలంక విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - తాళ్లపూడి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షలో ఐదవ తరగతిలో చేరడానికి తమ పాఠశాలకు చెందిన పిల్లి ప్రసూన ఎంపికైందని ప్రక్కిలంక ప్రత్యేక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.గణేష్ తెలిపారు. బొమ్మూరు గురుకుల పాఠశాలలో చదువుకోడానికి సీటు సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రసూనను ప్రధానోపాధ్యాయుడు జి.గణేష్, ఉపాధ్యాయుడు కె.శ్రీనివాస్ అభినందించారు.

గోదావరి గట్టును అభివృద్ధి చేస్తా : ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తనను గెలిపిస్తే గోదావరి గట్టును మరింత అభివృద్ధి చేస్తానని రాజమహేంద్రవరం సిటీ వైసిపి అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. సోమవారం 23వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల మద్దతు కోరారు. ఎంపీగా నగరానికి చేసిన అభివృద్ధిని వివరిస్తూనే, ఎంఎల్‌ఎగా గెలిచిన తరువాత చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గోదావరి బండ్‌ను హైదరాబాదు ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. నగర వాసులకు ఎటువంటి మంచినీటి ఎద్దడి లేకుండా, 24 గంటలూ సరఫరా అయ్యేలా ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడతానని తెలిపారు. నగరం అభివృద్ధి దిశలో శరవేగంగా పరుగులు పెడుతోందని, ఆ పరుగుకు కళ్ళెం వేయకుండా తన విజయానికి సహకరించాలని కోరారు. ఈ వార్డులో మహిళలు ఎంపీ భరత్ కు హారతులు పట్టారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జి.వేమవరం రాయమెరక ఆశ్రమం సెంటర్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జామకాయల తూము సెంటర్ నుంచి జి.వేమవరం వెళ్తున్న ఆటో రోడ్డుపై ఉన్న గుంతలో పడి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఒక మహిళకు తీవ్ర గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆసుపత్రిలో వివాహిత మృతి

ప్రజాశక్తి - కాజులూరు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత చెల్లి ఆదిలక్ష్మి (22) పరిస్థితి విషమించి మతి చెందింది. ఈ సంఘటనపై గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ వివరాలను వెల్లడించారు. మండలంలోని సలపాక గ్రామానికి చెందిన చెల్లి ఆదిలక్ష్మికి అదే గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొద్ది రోజులుగా ఆదిలక్ష్మికి అనారోగ్య కారణంగా ఉండడంతో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఆదిలక్ష్మి ఒంటిపై టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించుకోగా స్థానికలు గమనించి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదిలక్ష్మికి ఏడాది వయస్సు కల్గిన కుమారుడు ఉన్నాడు. తహశీల్దార్ శాంతిలక్ష్మి, ఎస్ఐ తులసి రామ్ లు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆటో ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో ఆటో తిరగబడి వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు గాయాలపాలయ్యారు. సామర్లకోట నుంచి పెద్దాపురం విద్యార్థులతో వెళ్తున్న ఆటో విమల్ కంపెనీ సమీపంలో ముందు వెళ్తున్న బైకును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి తిరగబడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థినులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థినులను సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట మహిళా ఎస్ఐ మౌనిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థునులను వైసిపి పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ పరామర్శించారు.

రూ.1.20 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.1.20 లక్షల విలువ చేసే నగదును సీజ్ చేశామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనాలు తనిఖీలు చేస్తుండగా తాళ్లపూడికి చెందిన నీలం వీరభద్రరావు ఎటువంటి బిల్లులు లేకుండా విజయవాడ నుంచి కారులో రూ.1.20 లక్షలను తీసుకొస్తున్నారన్నారు. దీంతో సీజ్ చేశామన్నారు.

గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం కడియపులంక తూర్పు డెల్టా ప్రధాన కాలువలోకి సోమవారం స్నానానికిదిగి గల్లంతైన యువకుడు మృతి చెందాడని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. కడియం మండలం దామిరెడ్డి పల్లికి చెందిన రాయపాటి అయ్యప్ప(30) కడియపులంక సెంటర్ జాతీయ రహదారి పక్కన పువ్వులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాలువలో స్నానానికి దిగిన అయ్యప్ప ప్రమాదవశాస్తు కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తిరుగుడు మెట్టకు చెందిన వివాహిత సైదు భాగ్యశ్రీ(24) కడుపునొప్పి భరించలేక సోమవారం ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తాళ్లపూడి ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. భాగ్యశ్రీ కొంతకాలంగా కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతోందన్నారు. మృతురాలి పెద్దమ్మ పంతుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు. మృతురాలి భర్త సాయిబాబా మూడు నెలల క్రితం ఉపాధి నిమిత్తి గల్ఫ్ దేశాలకు వెళ్లాడని ఎస్ఐ తెలిపారు.

యువకులపై కేసు నమోదు

ప్రజాశక్తి - కడియం

కడియం దేవి సెంటర్లో ఘర్షణకు దిగి అలజడి సృష్టించిన యువకులపై కేసులు నమోదు చేశామని సిఐ బి.తులసీధర్ తెలిపారు. కడియం దేవి సెంటర్లో ఆదివారం సాయంత్రం ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారంటూ వచ్చిన సమాచారంతో కడియం ఎస్ఐ బిఎన్ దుర్గాప్రసాద్ తన సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. యువకులను పట్టుకునే క్రమంలో పోలీసుల రాకను గుర్తించిన కొందరు పరారవ్వగా మరికొందరు తాము కాదంటూ పోలీసులపై వాదనలకుదిగారు. సిఐ బి తులసిధర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఘటన స్థలానికి చేరుకొని ఘర్షణ పడ్డ 8 మంది యువకులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన యువకులకు వారి పెద్దల సమక్షంలో సీఐ తులసిధర్, ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో తమదైన శైలిలో కౌన్సిలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశంలో ఘర్షణ పడినందుకుగాను వారందరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. వారందరినీ క్రిమినల్ కోర్టుకు హాజరు కావాల్సిందిగా బాండ్ తీసుకొని పంపించినట్లు సిఐ తెలిపారు. రౌడీ చర్యలు, అల్లరి చేయడం, ప్రజాశాంతికి భంగం కలిగించడం, బహిరంగ ప్రదేశాల్లో అలజడులు వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఒకసారి క్రిమినల్ కేసులలో పేర్లు నమోదు అయితే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యువతను సిఐ హెచ్చరించారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముమ్మిడివరం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పడమట పాలెంకి చెందిన మంజుల సతీష్ కుమార్, నడకుదటి బాలకృష్ణ బొలెరో వాహనంలో సుమారు 2100 లీటర్ల డీజిల్ అక్రమంగా తరలిస్తుండగా ముమ్మిడివరం పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకుని డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించి వికలాంగురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకునిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతిని తల్లిదండ్రులు ఎప్పటిలాగే ఇంట్లో వదిలి కూలి పనికి వెళ్లారు. రోజూ ఇది గమనిస్తున్న అదే గ్రామానికి చెందిన అంజి అనే యువకుడు సోమవారం ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై అత్యాచారం చేయడానికి నోరు నొక్కి ఆమెను ప్రయత్నించాడు ఇంతలో ఆమె గట్టిగా అరవడంతో అంజి పారిపోయాడు. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చాక యువతి విషయం తెలిపింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకును కారు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్లలోని కొండాలమ్మ గుడి సమీపంలో సోమవారం బైకును కారు ఢీకొని ఒకరి తీవ్ర గాయాలయ్యాయి. రావులపాలెంకు చెందిన ఆదిమూలం ఈశ్వరరావు బైకుపై డివైడర్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి కారు ఢీకొని డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుని రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం గ్రామానికి చెందిన కందుకూరి వెంకన్న కూలి పనుల మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో జాలిమూడికి చెందిన యడ్ల లచ్చయ్య డబ్బులు తీసుకుని పనికి రావట్లేదు. దీనిపై వెంకన్న జాలిమూడి వెళ్లి లచ్చయ్యను డబ్బులు వెనక్కి ఇవ్వాలని అడిగాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. లచ్చయ్య అన్న కొడుకు రాంబాబు బకెట్‌తో వెంకన్నను కొట్టాడు. దీంతో తలపై, కుడి భుజంపై వెంకన్నకు రక్తపు గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై యడ్ల అచ్చియమ్మ, కందుకూరి ప్రదీప్, కండవల్లి శేఖర్, మేకల సుబ్రహ్మణ్యంపై కౌంటర్ కేసు నమోదైంది.

సీజ్ చేసిన వస్తువుల డేటా డిజిటలైజ్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సీజ్ చేసిన వస్తువల డేటాను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ(ఇఎస్ఎంఎస్) పనితీరుపై సిజర్ నోడల్ ఏజెన్సీ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కలెక్టర్ మాట్లాడారు. గత ఏడాది ఇదే సందర్భంలో జరిగిన లావాదేవీలు, ప్రస్తుతం జరుపుతున్న లావాదేవీల ఆధారంగా చేసుకుని డేటాను విశ్లేషణ చేయాల్సి ఉంటుందన్నారు. అధిక మొత్తంలో జరిగిన లావాదేవీలపై నిఘా పెట్టాలన్నారు. రైల్వేలు, రోడ్డు రవాణా ద్వారా తరలింపుపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో రూ.28,89,810 నగదు సీజ్ చేశామన్నారు. నిజ నిర్ధారణ చేసిన తర్వాత మాత్రమే సీజింగ్ చేసిన వస్తువులు, నగదును విడుదల చేయాలన్నారు. బాధ్యతారాహిత్యంగా వహిస్తే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర జీఎస్‌టి ఆధ్వర్యంలో జిల్లాకు వస్తున్న వివిధ కంటెన్మెంట్‌ల వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ఉన్నాయో



లేదో రికార్డులను పరిశీలించి, నివేదిక అందించాలన్నారు. రూ.50 వేలు మించి నగదు వెంట తీసుకుని వెళ్ళే సందర్భంలో తగిన ఆధారాలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైల్వే, ఇతర రవాణా మార్గాలలో వస్తున్న వాటికి చెందిన నివేదికలు విషయంలో ఒకే ఫార్మేట్‌ను అనుసరించాలని జిల్లా ఆడిట్ అధికారి కెవి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో సెబ్ అధికారులు పి.సోమశేఖర్, కె.జయ మౌనిక, ఎల్‌డిఎం డివి.ప్రసాద్, ఐటి అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నేడు యానాం రాక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఏకైక పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వి.వైథిలింగం మంగళవారం యానాం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్దాని దినేష్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం బాలయోగి స్టేడియం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి సావిత్రి నగర్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థి వెంట మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామి, ఎంఎల్‌ఎ వైద్యనాథన్, పెద సత్య ఫేరుమాళ్, ఎఐసిసి నేషనల్ కోఆర్డినేటర్



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుల బృందం

హరివరగన్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రతినిధి ఎ.కాంగయ్యన్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటంశెట్టి రామ్మూర్తి, మల్లాడి వీరస్వామి, కాదా పవన్, పెసల వెంకటేష్, దవులూరి పతి, విళ్ల చిన్ని, జి.దినేష్ పాల్గొన్నారు.

'పెన్షన్ల నిలిపివేతకు టిడిపియే కారణం'

గోకవరం : పెన్షన్ల నిలిపివేతకు టిడిపియే కారణమని పలువురు వైసిపి నాయకులు అన్నారు. గోకవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వాలంటీర్ల ద్వారా గడప గడపకు అందుతున్న సంక్షేమాన్ని అడ్డుకునేందుకు టిడిపి కుట్రలు చేసిందన్నారు. అవ్వాతాతలకు పెన్షన్ అందించడంలో కావాలనే జాప్యం చేయిస్తూ వద్దులకు అన్యాయం చేసిందన్నారు. అనారోగ్య సమస్యలున్న వయో వృద్ధులు, వికలాంగులు ఇంటి దగ్గరే వాలంటర్లీ ద్వారా పింఛను పొందేవారన్నారు. టిడిపి కుట్రల వల్ల లబ్ధిదారులను సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు వీరబాబు, సొసైటీ చైర్‌పర్సన్ దాసరి చినబాబు, వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను జగన్ ప్రతి రోజూ ఫూల్స్ చేస్తున్నారు

ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేలండర్ ప్రకారం ఫూల్స్ డే ఏడాదికి ఒకసారి మత్రమే వస్తే... జగన్ తన పాలనతో ప్రజలను ప్రతి రోజూ ఫూల్స్‌ని చేస్తూ వచ్చాడని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడారు. అధికారంలోకొచ్చిన తరువాత పెన్షన్లు రూ.3 వేలు ఇస్తామని చెప్పి, ఒక్కసారే రూ.3వేలు కాదు ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతామని ఫూల్స్ చేస్తూ వచ్చారన్నారు. 45 ఏళ్లు వచ్చిన ప్రతి మహిళకు పెన్షన్ ఇస్తామని చెప్పి అధికారంలోకొచ్చిన తరువాత మాటమార్చి ఫూల్స్‌ను చేస్తూ వచ్చారన్నారు. మద్యపాన నిషేదం, మెగా డిఎస్‌సి, జాబ్ క్యాలెండర్ ఇలా అన్ని విషయాల్లోనూ ఆయనప్రజలను ఫూల్స్‌ని చేశారని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో ఆథరైజేషన్ తెలిపేలా ముద్రకానీ, సంతకం కానీ లేదని గుర్తు చేశారు. బూరుగుపూడి ఆవ భూముల్లో జరిగిన అవినీతి ఎవరు చేశారో అందరికీ తెలుసునన్నారు. కానవరంలో కొనుగోలు చేసిన భూములకు సంబంధించిన రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అయిన తరువాత ఒక్కో రైతు రూ.7 లక్షలు ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారని ఈ విషయాన్ని బాధిత రైతులే చెబుతున్నారన్నారు. రూ.7లక్షలు ఎవరికి, ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. ఆవ భూములు, కానవరం ఇతర ప్రాంతాల్లో పట్టాలు పొందిన ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. అవినీతిపై సిబిఐతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య, జనసేన రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే వాలంటీర్లతో రాజీనామాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకే వాలంటీర్లతో వైసిపి నాయకులు రాజీనామాలు చేయిస్తున్నారని పిసిసి ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యసూర్యలక్ష్మి అన్నారు. మూడు నెలల జీతం తామే ఇస్తామని వాలంటీర్లు రాజీనామా చేసి వైసీపీకి ప్రచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రతి వాలంటీర్ వద్ద 50 ఇళ్లకు సంబంధించి పూర్తి సమాచారం ఉందన్నారు. ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తూ పార్టీకి ప్రచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం వస్తే మళ్లీ తీసుకుంటామని చెప్పి వాలంటీర్ల నమ్మిస్తున్నారన్నారు. వాలంటీర్ల జీవితాలతో ఆటలాడుకోవడం సరికాదన్నారు. వాలంటీర్లు ఈ విషయాన్ని గమనించాలన్నారు. భవిష్యత్తు కోసం ఆలోచించుకోవాలని హితువు పలికారు. ఖజానాలో డబ్బులు లేవని, అందుకే పెన్షన్ల రాజకీయానికి తెరలేపారని విమర్శించారు.

అప్రూవల్ లే-అవుట్లలోనే ఇళ్ల పట్టాలిచ్చాం...

మీడియా సమావేశంలో ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ళ పట్టాలు పక్కా లే అవుట్ చేసి మరీ ఇచ్చామని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల పట్టాలపై టిడిపి నేతలు చేసే ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు అమరావతిని గ్రాఫిక్స్‌లో చూపించి ప్రజలను ఒక భ్రాంతిలో ఉంచారన్నారు. ఆ తరహా ఆలోచనల నుంచి టిడిపి నేతలు ఇంకా బయటకు రాలేదన్నారు. ఏది చూసినా మోసం..మోసం అనడం అలవాటై విమర్శలు చేస్తున్నారన్నారు. డిటిసిపి లే అవుట్ చేసి ఇస్తే భోగస్ పట్టాలని, ఫేక్ పట్టాలని ఆరోపించడం రాజకీయ కుట్ర తప్పిస్తే మరొకటి కాదన్నారు. గతంలో టిడ్కో ఇళ్లు ఇస్తామని రూ.లక్షా, రెండు లక్షలు లబ్ధిదారుల నుంచి తీసుకున్నది ఈ ప్రబుద్ధులే కదా అని ప్రశ్నించారు. ప్రజల్లో తనపై ఉన్న అభిమానం, గౌరవం పోగొట్టే విధంగా రకరకాల నిందారోపణలు చేయడం తప్పిస్తే.. తన సవాల్‌ను స్వీకరించే సత్తా వారికి లేదన్నారు. దొంగ పట్టాలిచ్చేంత దౌర్భాగ్య పరిస్థితి తమకు లేదన్నారు. పేదలకు ఒకే రోజు 25 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలిచ్చి రికార్డు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్

సృష్టించామని, లబ్ధిదారుల సంతోషాన్ని ఆవిరి చేయడానికే ఈ రకమైన ప్రచారానికి ఆదిరెడ్డి వాసు పూనుకున్నాడన్నారు. ఈ సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో13 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 9వతరగతి ప్రవేశ పరీక్షకు 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు మొత్తం 161 మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది ఎంపికైనట్టు వెల్లడించారు.

టిడిపిలోకి గద్దే వెంకటకృష్ణచౌదరి

ప్రజాశక్తి - సీతానగరం

సీనియర్ నాయకులు గద్దే వెంకటకృష్ణచౌదరి సోమవారం టిడిపిలో చేరారు. వైసిపి నియోజకవర్గ బూత్ కమిటి ప్రెసిడెంట్ పదవికి, నియోజకవర్గ వైసిపి జాయినింగ్ కమిటీ కన్వీనర్ పదవులకు ఆయన రాజీనామా చేశారు. అనంతరం అనుచరులతో కలిసి టిడిపి రాజానగరం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి సమక్షంలో పార్టీలో చేరారు. వెంకట రమణ చౌదరి పార్టీ కండువా కప్పి వెంకటకృష్ణ (నళిని)ను సాదరంగా ఆహ్వానించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - పెరవలి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై కూటమి బలపర్చిన జనసేన అభ్యర్థి కందులు దుర్గేష్‌కు కార్మిక నాయకులు వినతిపత్రం అందించారు. పెరవలి, ఉండ్రాజవరం మండల భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. సమస్యలను, ఇబ్బందులను పలువురు కార్మికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గుండుమేను జగన్నాథం, మండల అధ్యక్షుడు పూరెల్ల ధనరాజ్, కార్యదర్శి పంపన వెంకటేశ్వరరావు, సుబ్బారావు, కిరణ్, గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం గౌరుపల్లి, మల్లవరం, నేలటూరు తదితర గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - యానాం

ఎన్ఆర్.కాంగ్రెస్ పార్టీ, బిజెపి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. సోమవారం స్థానిక యర్రా గార్డెన్లోని గాజుల మినీ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తాను యానాం అభివృద్ధి కోసం పుదుచ్చేరిలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. నమశ్శివాయం ఎంపీగా గెలుపొందిన పక్షంలో యానాం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- కడియం

మురమండ 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో గల 11కెవి మురమండ హెడ్ క్వాటర్ ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు, ట్రీకటింగ్ నేపథ్యంలో మురమండ గ్రామంలో మంగళవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఊనగట్లలో ప్రజా ఆశీర్వాద యాత్ర

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఊనగట్లలో సోమవారం ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి తమను గెలిపించాలని కోరారు. పెన్షన్ నిలిచిపోవడానికి టిడిపి అనుబంధ వ్యక్తులే కరానణమన్నారు. అయినప్పటికీ సచివాలయాల ద్వారా పెన్షన్ అందజేస్తామని తెలిపారు. గూడూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను పార్లమెంట్ నియోజకవర్గం అందరికీ అందుబాటు ఉండే వ్యక్తిని అన్నారు. తనకు ఎంపీగా ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలక్ష్మి, ఎంపిపి మట్ట వీరాస్వామి, సర్పంచ్ మట్ట వెంకట్రావు, ఎంపిటిసి సభ్యులు ఆత్కూరి గోపీనాథ్, వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజశ్రీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ముగ్గళ్లలో ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సతీమణి జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులతో కలిసి ఇంటింటా తిరిగారు. ప్రతి మహిళకు బొట్టుపెట్టి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. జక్కంపూడి రాజశ్రీ మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవానికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. ముగ్గళ్ళ గ్రామంలో సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో 'బత్తుల' కుమార్తె

ప్రజాశక్తి - సీతానగరం

కూనవరం గ్రామంలో జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కుమార్తె ప్రత్యూషదేవి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూనవరంలో ఇంటింటా తిరిగి గాజుగ్లాస్‌కు ఓటు వేసి బత్తుల బలరామకృష్ణను గెలిపించాలని కోరారు. బలరామకృష్ణపై అధికార పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో వలవల రాజా, తెలుగు మహిళ పల్లి శశికళ, కారిచర్ల విజయశంకర్, మట్టా వెంకటేశ్వరరావు, మద్దాల యేసుపాదం జనశ్రేణులు, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.